ఎయిరిండియా భోజనంలో బ్లేడ్!

న్యూఢిల్లీ, జూన్ 17: ఎయిరిండియా అందించిన భోజనంలో బ్లేడ్ రావడంతో ప్రయాణికుడు ఖంగుతిన్నాడు. తినే సందర్భంలో బ్లేడ్ (బ్లేడ్ లాంటి ఇనుప ముక్క) గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. గతవారం బెంగళూరు నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు ఎయిరిండియా ఏఐ175 విమానంలో వెళ్లిన మాథూర్స్ పాల్ అనే జర్నలిస్టుకు ఈ చెడు అనుభవం ఎదురైంది. ఇదే భోజనాన్ని చిన్నారులకు అందించి ఉంటే పరిస్థితి ఏమిటి? అని బాధితుడు ఎక్స్ వేదికగా నిలదీశాడు. దీనిపై ఎయిరిండియా స్పందించింది. సారీ చెప్పడంతోపాటు మరోసారి ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకుంటామని పేర్కొన్నది. బాధితుడికి బిజినెస్ క్లాస్‌లో ప్రపంచంలో ఎక్కడికైనా వన్‌వే టికెట్ ఆఫర్ చేసింది. అయితే, ఎయిరిండియా ఆఫర్‌ను పాల్ తిరస్కరించారు. టికెట్‌ను లంచంగా అభివర్ణించారు.

బర్డ్ ఫ్లూ నుంచే తర్వాతి మహమ్మారి!

వాషింగ్టన్: తర్వాతి మహమ్మారి బర్డ్ ఫ్లూ నుంచి రావొచ్చని అమెరికాలోని వ్యాధి నియంత్రణ, నిరోధక సంస్థ(సీడీసీ) మాజీ డైరెక్టర్ రాబర్ట్ రెడ్‌ఫీల్డ్ అంచనా వేశారు. అమెరికాలోని ఆవుల మందల్లో బర్డ్ ఫ్లూ వ్యాప్తిపై పెరుగుతున్న ఆందోళన గురించి ఆయన ఒక వార్తా చానల్‌తో మాట్లాడారు. కొవిడ్‌తో పోలిస్తే మనుషుల్లో బర్డ్ ఫ్లూతో మరణాల సంఖ్య ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కొవిడ్ మరణాల రేటు 0.6%కాగా.. బర్డ్ ఫ్లూ వల్ల అది 25-50 శాతంగా ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

గూగుల్ క్రోమ్‌లో వెబ్ పేజీలను వినొచ్చు

న్యూఢిల్లీ, జూన్ 17: ప్రముఖ సెర్చ్ ఇంజిన్ 'గూగుల్' ఆండ్రాయిడ్ యూజర్ల కోసం కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గూగుల్ క్రోమ్‌లో వెబ్ పేజీలను చదవి వినిపించే 'లిజన్ టు దిస్ పేజ్' కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా యూజర్లకు నచ్చిన వెబ్ పేజీలోకి వెళ్లి టెక్స్ట్‌ను ఆడియో రూపంలో వినొచ్చు. ఈ సదుపాయం అందరికీ అందుబాటులోకి రానున్నది. 12 భాషలకు ఈ సదుపాయం సపోర్ట్ చేస్తుందని, ప్రస్తుతానికి అన్ని వెబ్ పేజీలకు ఈ ఫీచర్ పనిచేయటం లేదని తెలిసింది. సపోర్ట్ చేసే పేజీలకు మాత్రమే ప్లేబ్యాక్ సదుపాయం కనిపిస్తున్నది.

అమెరికాలో భారత యువతిని కాల్చిచంపిన భారత సంతతి వ్యక్తి

వాషింగ్టన్: అమెరికాలోని న్యూజెర్సీలో భారత సంతతికి చెందిన ఓ యువకుడు జరిపిన కాల్పుల్లో భారత యువతి ప్రాణాలు కోల్పోగా, మరో యువతి తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా పంజాబ్‌కు చెందినవారు. మీడియా కథనాల ప్రకారం, నిందితుడు గౌరవ్ గిల్ (19) వాషింగ్టన్‌లోని కెంట్‌లో ఉంటున్నాడు. జస్వీర్ కౌర్ (29), గగన్‌దీప్ కౌర్ (20) ఒకే ఇంట్లో ఉంటున్నారు. గౌరవ్, గగన్‌దీప్ పంజాబ్‌లోని సకోదర్‌లో ఐతఎఎల్‌టీఎస్ కోచింగ్ సెంటర్‌లో కలిసి చదివారు. జస్వీర్ కార్టెరెట్‌లోని అమెజాన్ ఫెసిలిటీలో, ఆమె భర్త ట్రక్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. బుధవారం జస్వీర్ నిద్రపోతున్న సమయంలో నిందితుడు గౌరవ్ వారి ఇంటి వద్దకు వచ్చాడు. గగన్‌దీప్‌తో గొడవపడ్డాడు. ఆమె జస్వీర్‌ను పిలిచింది. గౌరవ్‌కు జస్వీర్ సర్దిచెప్పబోయారు. వెంటనే గౌరవ్ కాల్పులు జరిపాడు. దీంతో జస్వీర్, గగన్‌దీప్ తీవ్రంగా గాయపడ్డారు. జస్వీర్ దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. గగన్‌దీప్ పరిస్థితి విషమంగా ఉంది.

ఉత్తర కొరియా పర్యటనకు పుతిన్

సియోల్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మంగళ, బుధవారాల్లో ఉత్తర కొరియాలో పర్యటించబోతున్నారు. ఇరు దేశాలు ఈ మేరకు ప్రకటనలను జారీ చేశాయి. పుతిన్ ఈ దేశంలో పర్యటిస్తుండటం 24 ఏళ్లలో ఇదే తొలిసారి. అమెరికాను ఈ రెండు దేశాలు వేర్వేరుగా ఎదుర్కొంటున్న తరుణంలో పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ భేటీ కాబోతున్నారు. సైనిక సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై వీరు చర్చలు జరిపే అవకాశం ఉంది. రష్యా నుంచి ఆర్థిక సహకారం, సాంకేతిక పరిజ్ఞానాలను తీసుకుని, ఆ దేశానికి అవసరమైన ఆయుధాలు, క్షిపణులను ఉత్తర కొరియా ఇస్తున్నదని అమెరికా, దక్షిణ కొరియా ఆరోపిస్తున్నాయి.

'నీట్'గా తెగించేశారు!

- లక్షలు దండుకొని అంగడి సరుకుగా పేపర్లు
- పది రోజుల ముందుగా ఎన్నికల ఫలితాల రోజే రిజల్ట్స్
- అక్రమాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ వ్యూహం!
- నీట్ పాపాలకు కేరాఫ్‌గా ఎన్డీయే పాలిత రాష్ట్రాలు
- గుజరాత్, బీహార్‌లో లీక్ మూలాలు రుజువు
- తొలుత కాదని.. ఆ తర్వాత ఒప్పుకొన్న కేంద్రమంత్రి
- 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలు ఆగమాగం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలు, ఫలితాల వెల్లడిలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. నీట్‌లో ఎలాంటి అక్రమాలు జరుగలేదని వాదించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. అక్రమాలు జరిగిన మాట నిజమేనని తాజాగా ఒప్పుకొన్నారు. నీట్ అక్రమాలు గుజరాత్, బీహార్‌లో వెలుగుచూడటం.. అక్కడ ఎన్డీయే కూటమి ప్రభుత్వాలే అధికారంలో ఉండటం రాజకీయంగానూ చర్చనీయాంశమైంది.

నీట్‌గా చేద్దామని..చివరకు దొరికిపోయి..

మే 5న నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్షకు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా నిర్వహణ, ఫలితాల వెల్లడి, ర్యాంకుల ప్రకటన విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వ్యవహరించిన తీరు తొలి నుంచీ అనుమానాస్పదంగానే ఉన్నది.

1. టాప్ ర్యాంకులు

2019 నుంచి ఎన్నడూలేని విధంగా ఈసారి ఏకంగా 67 మందికి 720కి గానూ 720 మార్కులు రావడం అక్రమాలు జరిగాయన్న అనుమానాలకు తొలి బీజాన్ని వేసింది. ఎందుకంటే 2023లో నిర్వహించిన నీట్‌లో ఇద్దరికి మాత్రమే 720 మార్కులు వచ్చాయి. 2022లో ఒక్కరికే వచ్చాయి. 2021లో ముగ్గురికి, 2020, 2019లో ఒక్కొక్కరి చొప్పున 720 మార్కులు సాధించారు. కానీ, ఈసారి అసాధారణ రీతిలో 67 మంది టాపర్లుగా నిలిచారు. నీట్ వంటి అత్యున్నత స్థాయి పరీక్షలో ఇంతమందికి ర్యాంకులు రావడం అసాధారణం.

2. మార్కుల్లో తేడాలు

హర్యానాలోని ఒకే సెంటర్‌లో పరీక్షలు రాసిన ఆరుగురికి 720కి 720 మార్కులు రావడం.. అలాగే 180 ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు 4 మార్కుల చొప్పున మొత్తం 720 మార్కులకు పరీక్ష నిర్వహించగా, కొందరికి 719, 718 మార్కులు కూడా వచ్చాయి. +4, -1 విధానంలో నిర్వహించే నీట్ ఎగ్జామ్‌లో ఇది అసాధ్యం. దీంతో అక్రమాలు జరిగాయన్న అనుమానాలు మరింత బలపడ్డాయి.

3. గ్రేస్ మార్కుల వివాదం

కొన్ని పరీక్షా కేంద్రాల్లో తలెత్తిన సాంకేతిక సమస్యలతో నీట్ పరీక్ష ఆలస్యంగా మొదలైంది. దీంతో 1,563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలిపినట్టు ఎన్టీఏ వెల్లడించింది. గ్రేస్ మార్కులు కలిపిన వారిలో కొందరు టాపర్లు కూడా ఉన్నారు. అయితే, ఏ ప్రాతిపదికన ఈ మార్కులు కలిపారు? దీని కోసం ఏ నిబంధనలను పాటించారు? అని ఎన్టీఏను పలువురు ప్రశ్నించారు. వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. దీంతో వెనక్కి తగ్గిన ఎన్టీఏ తిరిగి ఆ అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని తేలిగ్గా చెప్పింది.

4. ఫలితాల వెల్లడి

తొలుత జూన్ 14న ఫలితాలు ప్రకటిస్తామన్న ఎన్టీఏ 10 రోజుల ముందు అంటే జూన్ 4న రిజల్ట్స్ విడుదల చేసింది. అదేరోజు లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రావడం గమనార్హం. అవకతవకలపై నుంచి దృష్టి మళ్లించడానికే ఎన్టీఏ ఇలా చేసిందన్న ఆరోపణలున్నాయి.

మూలాలు అక్కడే

నీట్ పరీక్షల్లో అవకతవకలకు మూలాలు బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్, ఎన్డీయే అధికారంలో ఉన్న బీహార్ రాష్ట్రాల్లోనే వెలుగుచూడటం గమనార్హం. గుజరాత్‌లోని పంచమహా జిల్లా గోద్రా పట్టణంలోని ఓ సెంటర్‌లో ఖాళీ ఓఎమ్మార్ షీట్‌లను ఇచ్చి వెళ్లమని లక్షిత విద్యార్థులకు కొందరు టీచర్లు సూచించినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇలా 27 మంది విద్యార్థులతో వీరికి రూ. 10 లక్షల చొప్పున బేరం కుదిరినట్టు సమాచారం. ఇక, బీహార్‌లో 30 మంది విద్యార్థులకు పరీక్షకు ముందు రోజూ ప్రశ్నాపత్రాన్ని కంఠస్థం చేయించినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీని కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ. 30 లక్షల నుంచి రూ. 32 లక్షలు వసూలు చేసినట్టు సమాచారం. కాగా, తొలుత అక్రమాలు జరుగలేదని ఎన్టీఏను వెనకేసుకు వచ్చిన విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. ఆ తర్వాత అక్రమాలు నిజమేనని ఒప్పుకోవడం, ఎన్టీఏలో ఉన్న తాధికారులు దోషులుగా తేలితే చర్యలు తీసుకొంటామని పేర్కొనడం మరింత చర్చకు దారితీస్తున్నది. అక్రమాల సంగతి బయటపడటంతో ప్రభుత్వానికి మచ్చరాకుండా తప్పనంతా ఎన్టీఏ మీదికే నెట్టివేయాలని సర్కారు పెద్దలు కుట్రలకు తెరతీస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ఎప్పుడు?

- నీట్ పరీక్షపై వీడని పీటముడి
- పేపర్ లీకేజీలతో పరీక్ష రద్దుకు పెరుగుతున్న డిమాండ్
- కౌన్సెలింగ్ జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి
- దేశవ్యాప్తంగా 13 లక్షల మంది విద్యార్థుల ఎదురుచూపు
- విద్యాసంవత్సరం వృథా అవుతుందని ఆందోళన

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం నిర్వహించిన 'నీట్' పరీక్ష భవిష్యత్తు ఏమిటో తెలియక లక్షలాది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పరీక్షను రద్దు చేయాలంటూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగుతున్న నేపథ్యంలో కౌన్సెలింగ్ ఎప్పుడు జరుగుతుందో, ప్రవేశాలు ఎప్పుడు పూర్తవుతాయో, తరగతులు ఎప్పుడు మొదలవుతాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఈ నెల 4న నీట్ ఫలితాలు వెల్లడయ్యాయి. ముందుగా 1563 మంది విద్యార్థుల ర్యాంకులపై అనుమానాలతో మొదలై.. పేపర్ లీకేజీ వరకు చేరింది. దీంతో పరీక్షనే రద్దు చేయాలంటూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, రాజకీయ పక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 549 మెడికల్ కాలేజీల్లో 78వేల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా మరికొన్ని మెడికల్ కాలేజీలకు అనుమతులు రావాల్సి ఉన్నది. ఈ ఏడాది 2,333,297 మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా.. 13,16,268 మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో 77,849 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 60.8% మంది అంటే 47,371 మంది అర్హత సాధించారు. నీట్ భవితవ్యం ఏమిటో తెలియక ఇప్పుడు వీరంతా దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కౌన్సిలింగ్‌లో జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇవ్వడంతో అభ్యర్థుల్లో కాస్త ఆశలు చిగురించాయి. అయితే.. తాజాగా ఈ వ్యవహారం పేపర్ లీకేజీగా మారడంతో మళ్లీ కథ మొదటికి వచ్చింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) కూడా స్పష్టమైన ప్రకటన విడుదల చేయడం లేదు. అనుమానం ఉన్న 1563 మందికి త్వరలో పరీక్ష నిర్వహించనున్నారు. వారి ఫలితాలు వచ్చి, ఆ తర్వాత కౌన్సిలింగ్ చేపట్టినా తరగతులు ప్రారంభం అయ్యేనాటికి కనీసం రెండు నెలలు పడుతుందని విద్యార్థులు చెప్తున్నారు. ఒకవేళ నీట్ పరీక్షను రద్దు చేసి మరోసారి పరీక్ష నిర్వహించాల్సి వస్తే మాత్రం నవంబర్, డిసెంబర్‌కు కూడా తేలకపోవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త కాలేజీల మాటేమిటి?

ప్రస్తుతం రాష్ట్రంలో 56 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో 3,915, ప్రైవేటు కాలేజీల్లో 4,600 కలిపి మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మరో 10 కాలేజీల అనుమతులు ఎన్ఎంసీ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇందు లో 8 ప్రభుత్వ కాలేజీలు. వీటిపై ఇప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదు. వీటికి అనుమతులు వస్తే మరో 500 సీట్లు అందుబాటులోకి వస్తాయి. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి కోటా 15శాతం, ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అటు కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వక.. ఇటు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం ఎదురుచూడాలో లేదా ఇతర కోర్సుల్లో చేరిపోవాలో తెలియక మథనడపతున్నారు.

2020 నాటి పరిస్థితులేనా?

2020లోనూ ఎంబీబీఎస్ విద్యార్థులు ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొన్నారు. ఆ ఏడాది కరోనా నేపథ్యంలో నీట్ పరీక్ష చాలా ఆలస్యంగా జరిగింది. సాధారణంగా మే నెలలో జరగాల్సిన పరీక్ష.. 2020లో ఏకంగా సెప్టెంబర్‌లో జరిగింది. అయితే నీట్ నిర్వహణపై అప్పటికే చాలా మంది విద్యార్థులు విద్యా సంవత్సరం వృథా కావొద్దనే ఉద్దేశంతో ఇతర డిగ్రీ కోర్సుల్లో, ఇతర యూనివర్సిటీల్లో చేరిపోయారు. నీట్ ఫలితాల అనంతరం కొందరు ఫీజులు, జరిమానాలు చెల్లించి తమ సర్టిఫికెట్లు వెనక్కి తెచ్చుకోవాల్సి వచ్చింది. ఆ ఏడాది దాదాపు ఐదు నెలలు ఆలస్యంగా డిసెంబర్‌లో తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ 5 నెలలను తిరిగి సరిచేయడానికి నాలుగేండ్ల సమయం పట్టింది. ఈ సారి కూడా ఇలాంటి పరిస్థితులే పునరావృతమయ్యే అవకాశం ఉన్నదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీట్‌పై కేంద్రం తీరు దారుణం : కేటీఆర్

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): లక్షలాది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్రంగా కలచివేస్తున్న అంశాన్ని పరిష్కరించాల్సిందిపోయి అసలది సమస్యే కాదన్నట్టుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేతారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి నీట్ విషయంలో చేసిన వ్యాఖ్యలను ఆయన ఎక్స్ వేదికగా తప్పుబట్టారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్షా వ్యవహారంపై దుమారం చెలరేగుతుండగా కేంద్ర మంత్రి వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయంగా ఉన్నాయని మండిపడ్డారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

- సుప్రీం జడ్జితో విచారణ జరిపించాలి
- నేడు స్టూడెంట్ మార్చ్: బల్మూరి

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్: నీట్ అక్రమాల పుట్టగా మారిందని ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ ప్రక్రియలో అక్రమాలు జరిగినా కేంద్రం చేష్టలుడిగి చూస్తున్నదని అన్నారు. నీట్ నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలని, ఆ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరారు. నీట్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం లిబర్టీ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు స్టూడెంట్ మార్చ్ నిర్వహిస్తామన్నారు.

రాజ్‌భవన్ నుంచి వెళ్లిపోండి

- పోలీసులకు బెంగాల్ గవర్నర్ బోస్ ఆదేశం
- పోలీస్ అవుట్ పోస్ట్ ప్రజా వేదికగా మార్పు!

కోల్‌కతా, జూన్ 17: రాజ్‌భవన్ నుంచి వెంటనే వెళ్లిపోవాలని అక్కడ విధులు నిర్వరిస్తున్న ఆఫీస్ ఇన్ ఛార్జి సహా పోలీసులందరినీ పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ సోమవారం ఆదేశించారు. రాజ్‌భవన్ తూర్పు ద్వారం వద్ద ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్‌ను గవర్నర్ 'జన్ మంచ్ (ప్రజా వేదిక)'గా మార్చాలనుకొంటున్నారని రాజ్‌భవన్ అధికారి ఒకరు పేర్కొన్నారు. గవర్నర్‌ను కలవడానికి వచ్చిన బీజేపీ నేత సువేందు అధికారి, లోక్‌సభ ఎన్నికల అనంతరం జరిగిన హింస బాధితులుగా చెప్తున్న కొందరిని రాజ్‌భవన్‌లోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్న తర్వాత ఈ పరిణామం చోటు చేసుకొంది. గవర్నర్‌ను కలవడానికి తనకు లిఖితపూర్వక అనుమతి ఉన్నా పోలీసులు తనను లోపలికి వెళ్లకుండా అడ్డుకొన్నారని సువేందు అధికారి తెలిపారు. దీనిపై ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీఎం మమతకూ ఈ విషయమై లేఖ రాశారు. అయితే రాజ్‌భవన్ బయట 144 సెక్షన్ అమల్లో ఉండటం వల్లే సువేందును అడ్డుకొన్నామని పోలీసులు చెప్పారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ గవర్నర్ బోస్ 'హౌస్ అరెస్ట్'లో ఉన్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

వయనాడ్‌కు రాహుల్ గుడ్‌బై

- రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగాలని నిర్ణయం
- వయనాడ్ నుంచి ప్రియాంక పోటీ: ఖర్గే

న్యూఢిల్లీ/వయనాడ్, జూన్ 17: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీచేసి గెలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ స్థానాన్ని వదులుకోవాలని నిర్ణయించారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ ఎంపీగా ఆయన కొనసాగుతారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం వెల్లడించారు. వయనాడ్ నుంచి ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ పోటీచేస్తారని తెలిపారు. ఈ మేరకు ఖర్గే నివాసంలో జరిగిన కాంగ్రెస్ అగ్రనేతల చర్చల అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడారు. తనకు రాయ్‌బరేలీ, వయనాడ్‌తో భావోద్వేగ సంబంధాలు ఉన్నాయని, ఇది తనకు చాలా కష్టమైన నిర్ణయమని అన్నారు. కష్ట సమయాల్లో వయనాడ్ ప్రజలు తనకు మద్దతుగా నిలిచారని, పోరాడేందుకు శక్తి ఇచ్చారని పేర్కొన్నారు. ఇకపై కూడా వయనాడ్‌కు తరచూ వెళ్తానని, నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ రాహుల్ అక్కడ లేరనే భావనను వయనాడ్ ప్రజలకు కలుగనివ్వనని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం రెండు లోక్‌సభ స్థానాల నుంచి గెలిచిన వాళ్లు.. ఫలితాల వెల్లడి తర్వాత 14 రోజుల్లోగా ఏదొక స్థానాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. కాగా, రాహుల్ వయనాడ్ స్థానాన్ని వదుకోవడంపై కేరళ బీజేపీ అధ్యక్షుడు కే సురేంద్రన్ విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తమ రాష్ట్రాన్ని ఒక రాజకీయ ఏటీఎంగా భావిస్తున్నదని, వయనాడ్ ప్రజలను రాహుల్ మోసం చేశారని సురేంద్రన్ ఆరోపించారు.

లోక్‌సభ స్పీకర్ పోస్ట్ కోరుకుంటున్న బీజేపీ!

మిత్రపక్షాలకు డిప్యూటీ పదవి ఆఫర్

న్యూఢిల్లీ, జూన్ 17: లోక్‌సభ స్పీకర్ పోస్ట్‌ను తమ వద్దే ఉంచుకోవాలని బీజేపీ భావిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు సోమవారం తెలిపాయి. మిత్రపక్షాలకు ఆ పార్టీ డిప్యూటీ స్పీకర్ పదవిని ఆఫర్ చేయొచ్చని వెల్లడించాయి. ఈ విషయమై బీజేపీనాయకుడు రాజ్‌నాథ్ సింగ్ జేడీయూ, టీడీపీతో చర్చలు జరిపినట్టు సమాచారం. ఈ నెల 26న స్పీకర్ ఎన్నిక జరగనుంది. ముందు రోజు మధ్యాహ్నం వరకు స్పీకర్‌గా పోటీ చేసే అభ్యర్థులకు మద్దతు ఇచ్చే ప్రతిపాదనలను సమర్పించవచ్చు. అయితే తమకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వకపోతే స్పీకర్ పదవికి ఒక అభ్యర్థిని బరిలో నిలపాలని ఇండియా కూటమి భావిస్తున్నది. స్పీకర్ అభ్యర్థి నిర్ణయంపై ఎన్డీయే కూటమిలో అంతర్గతంగా చర్చిస్తామని.. అభ్యర్థి ఖరారయ్యాక కూటమిలోని పార్టీలన్నీ ఆ అభ్యర్థినే బలపరుస్తాయని టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిరామ్ తెలిపారు.

పార్టీలోకి అడుగుపెట్టే సమయం ఆసన్నమైంది

మద్దతుదారులతో వీకే శశికళ

చెన్నై: తమిళనాడు మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలిగా రాష్ట్ర రాజకీయాల్లో ఒకప్పుడు కీలక పాత్ర పోషించిన వీకే శశికళ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీలోకి తిరిగి ప్రవేశించే సమయం వచ్చిందన్నారు. అందర్నీ ఏకతాటికిపైకి తీసుకొచ్చి, తమిళనాడులో అధికారాన్ని కైవసం చేసుకుంటామని ఆమె ప్రకటించారు. లోక్‌సభలో ఘోర ఓటమి తర్వాత.. ఏఐఏడీఎంకే పతనమైందని భావించలేమని, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి విజయం సాధించటం ద్వారా అమ్మ పాలనకు నాంది పలుకుతామంటూ ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతగా పళనిస్వామి అధికార పక్షాన్ని సరిగా ప్రశ్నించటం లేదని, ఆ లోటును తాను భర్తిచేయాలని అనుకుంటున్నట్టు చెప్పారు.

రెండు రైళ్లు ఢీ

పశ్చిమ బెంగాల్‌లో రైలు ప్రమాదం

- 9 మంది మృతి, 41 మందికి గాయాలు
- ట్రాక్‌పై ఆగి ఉన్న ఎక్స్‌ప్రెస్‌ను అదే ట్రాక్‌పై వెనుక నుంచి ఢీకొట్టిన గూడ్స్ రైలు
- పట్టాలు తప్పిన నాలుగు ఎక్స్‌ప్రెస్ బోగీలు
- సిగ్నలింగ్ వైఫల్యమే ప్రమాదానికి కారణం?

ప్రమాద వేగం వల్ల గూడ్స్ పైకి చేరి గాల్లో వేలాడుతున్న ఎక్స్‌ప్రెస్ బోగీ

న్యూ జల్‌పాయ్‌గురి/కోల్‌కతా/న్యూఢిల్లీ, జూన్ 17: పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం ఉదయం రైలు ప్రమాదం జరిగింది. ఒకే ట్రాక్‌పైకి వచ్చిన రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 9 మంది మరణించగా, 41 మందికి గాయాలయ్యాయని రైల్వే అధికారి ఒకరు వెల్లడించారు. అయితే మృతుల సంఖ్య 15 వరకు ఉన్నదని కొన్ని స్థానిక నివేదికలు పేర్కొన్నాయి. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నదని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని అధికారిక వర్గాలు తెలిపాయి. త్రిపురలోని అగర్తలా నుంచి కోల్‌కతాలోని సీల్దాకు వెళ్తున్న కాంచన్‌జంగ ఎక్స్‌ప్రెస్ రైలును న్యూ జల్‌పాయ్‌గురి రైల్వే స్టేషన్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని రంగపాని స్టేషన్ సమీపంలో అదే ట్రాక్‌పై వెనుక నుంచి వచ్చిన ఒక గూడ్స్ రైలు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ట్రాక్‌పై ఆగివున్న ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు ఢీకొట్టిందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ప్రమాదానికి సిగ్నల్ లోపం కారణమని తెలుస్తున్నది.

గాల్లోకి లేచిన ఎక్స్‌ప్రెస్ బోగీ

తాజా ప్రమాదంలో గూడ్స్ రైలు ఢీకొనడంతో ఎక్స్‌ప్రెస్ వెనుక నాలుగు బోగీలు పట్టాలు తప్పాయి. ఒక బోగీ కిందకు గూడ్స్ రైలు ఇంజిన్ దూసుకుపోవడంతో అది గాల్లోకి లేవడం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతున్నది. మృతుల్లో గూడ్స్ రైలు లోకోపైలట్, సహ లోకోపైలట్, ఎక్స్‌ప్రెస్ రైలు గార్డ్ కూడా ఉన్నారని రైల్వే శాఖ అధికారి తెలిపారు.

అనాథగా రైల్వే శాఖ: సీఎం మమత

రైలు ప్రమాదం గురించి తెలుసుకొని షాక్‌కు గురయ్యాయని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. రైల్వేకు మంత్రిత్వ శాఖ ఉన్నప్పటికీ, మునుపటి వైభవం లేదన్నారు. సుందరీకరణపైనే దృష్టి పెట్టిన కేంద్రం.. ప్రయాణికుల సదుపాయాలపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. చార్జీల ధరల పెంపుపైనే ఆసక్తి చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిగ్నల్ లోపమే కారణమా?

ప్రమాదం జరిగిన రాణిపత్